నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 4 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఎస్ఆర్‌టీ ఏరియాలో కూల్చివేసిన క్వార్టర్‌ను చూసి తల పట్టుకున్న నిర్వాసితుడు (ఫైల్)

పొంగులేటి హామీలు.. నీటిమూటలు

- కొత్తగూడెం సింగరేణి ఎస్ఆర్‌టీ ఏరియా క్వార్టర్లలో కొనసాగుతున్న కూల్చివేతలు
- ఆ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని నిరుడే హామీ ఇచ్చిన 'పొంగులేటి'
- అధికారంలోకి వచ్చాక అటువైపు కన్నెత్తి చూడని అమాత్యుడు
- క్వార్టర్లు కూల్చడంతో రోడ్డున పడిన రిటైర్డ్ కార్మికులు, వారి వారసులు
- నిరుడే ఇళ్ల స్థలాలు, పట్టా పత్రాలు ఇచ్చి ఆదుకున్న గత కేసీఆర్ సర్కారు
- సర్కారు మారడంతో గూడు చెదిరిన నిర్వాసితులు.. అర్హులకు దక్కని స్థలాలు

తాము అధికారంలోకి రాగానే నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటూ అప్పుడు మాజీ ఎంపీగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన హామీ.. ఆయన మంత్రి అయ్యాక కూడా నీటిమూటగానే మిగిలిపోయింది. గనుల విస్తరణ కోసం ఓ వైపు సింగరేణి అధికారులు క్వార్టర్లు కూల్చుతూ ముందుకెళ్తుంటే.. మాట ఇచ్చిన అమాత్యుడు మాత్రం అటువైపు చూసిన పాపాన పోవడం లేదు. దీంతో ఓ వైపు గూడు లేక, మరో వైపు మాట ఇచ్చిన మంత్రి నుంచి ఇందిరమ్మ ఇల్లు రాక, ఇంకోవైపు గత ప్రభుత్వం ఇచ్చిన జాగాల్లో ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేక.. ఆ నిర్వాసితులు పడుతున్న ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

గూళ్లు కూల్చుతున్నారు.. ఇందిరమ్మ ఇళ్లు ఇంకెప్పుడు సారూ..

రామవరం, నవంబర్ 3: వారు తమ తాతలు, తండ్రుల తరాల నుంచి ఇక్కడి బొగ్గుబావుల్లో పని చేసే కార్మికులు. ఆనాటి నుంచీ సింగరేణి ఎస్ఆర్‌టీ ప్రాంతంలోని క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. రెండు మూడు తరాలుగా ఇక్కడే జీవిస్తుండడంతో వారి కుమారులు, కుమార్తెలు, ఆ తరువాత వారి పిల్లలు కుటుంబాలుగా ఏర్పడ్డారు. వారు కూడా అదే క్వార్టర్ల సమీపంలో సింగరేణి స్థలంలో సొంతంగా ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. అయితే, రుద్రంపూర్ ఏరియా వెంకటేశ్ ఖని విస్తరణలో భాగంగా సింగరేణి మాజీ కార్మికులు, వారి వారసులు నివసించే ఈ క్వార్టర్లను సంస్థ కూల్చి వేసింది. వారంతా ఏడాది క్రితం నిర్వాసితులయ్యారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ నిర్వాసితులకు గత ఎమ్మెల్యే వనమా ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు ఇచ్చింది. ఆ తరువాత సర్కారు మారిపోయింది. ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. అదే.. ఆ నిర్వాసితుల పాలిట శాపమైంది. వారి ఇళ్లు కాదు కదా.. కనీసం జాగా ముచ్చట గురించి పట్టించుకునే వారు కూడా కరువయ్యారు. ఎంతమందికి చెప్పినా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా

నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాట ఇస్తున్న మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి (ఫైల్)

వారి వైపు చూసిన పాలకులు, అధికారులు లేరంటే అతిశయోక్తి కాదు. ఏడాది క్రితం సింగరేణి అధికారులు ఎస్ఆర్‌టీ నిర్వాసితులను ఖాళీ చేయించారు. వారికి కొత్తగూడెం మ్యాగ్జైన్ ప్రాంతంలో వంద గజాల చొప్పున స్థలాన్ని ఇచ్చారు. అయితే, 'ఇప్పటికిప్పుడు ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవాలంటే కనీసం రూ.5 లక్షలైనా కావాలి. ఇల్లు విప్పితే రేకులు తప్ప ఏమీ వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం తరపున మమ్మల్ని ఆదుకునే వారు కనపడడం లేదు.' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎస్ఆర్‌టీ నిర్వాసితులు. ఒకవైపు అధికారుల ఒత్తిడి పెరుగుతుండడం, మరోవైపు ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన హామీ రాకపోవడం వంటి కారణాలతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ సర్కారులోనే ఇంటి స్థలాలు..

ఈ నిర్వాసితులకు అప్పటి కేసీఆర్ సర్కారు అండగా నిలిచి ఇంటి జాగను ఇచ్చింది. సర్వే నంబర్ 143లో ఒక్కొక్కరికి వంద గజాల చొప్పున 286 మందికి గత ఏడాది అక్టోబర్ 3న అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఈ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వీరిలో మాయాబజార్ నుంచి 83 మంది, వనమా నగర్ నుంచి 61 మంది, ఎస్ఆర్‌టీ క్వార్టర్లలో ఉంటున్న 83 మంది, అదే ఎస్ఆర్‌టీ ఏరియాలో సొంతంగా నిర్మించుకున్న 59 మంది ఉన్నారు.

నెల రోజుల క్రితం జరిగిన కూల్చివేతల్లో అధికారుల కాళ్లు మొక్కుతూ తమ ఇల్లు కూల్చవద్దని వేడుకుంటున్న బాధితుడు కడారి సంపత్ (ఫైల్)

అసలైన నిర్వాసితులకు అన్యాయం..

ఎస్ఆర్‌టీ ప్రాంతంలో మొత్తం 154 క్వార్టర్లుండగా అందులోని 83 మందిని, సొంతంగా ఇల్లు నిర్మించుకున్న 65 మందిలో 59 మందిని మాత్రమే అప్పటి సింగరేణి అధికారులు లబ్ధిదారులుగా పరిగణించారు. వీరిలో కొందరు అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోవడంతో వారంతా అప్పటి ఎమ్మెల్యే వనమాను ఆశ్రయించారు. అర్హుల గుర్తింపునకు ఆయన మరోసారి సర్వేకు ఆదేశించినప్పటికీ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో అది ఆగిపోయింది. దీంతో నిజమైన అర్హులకు పట్టాలు అందలేదు. గతంలో వెంకటేశ్ ఖని ప్రాంతాన్ని ఖాళీ చేయించిన సందర్భంగా అక్కడ పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు ఎస్ఆర్‌టీ ఏరియాలో కూడా పట్టాలు తీసుకున్నారని, దీనివల్ల తమకు అన్యాయం జరిగిందని బాధితులు ఇప్పటికే కలెక్టర్‌కు విన్నవించారు.

హామీలు సంగతి అంతేనా?

లబ్ధిదారుల ఎంపికలో తమకు అన్యాయం జరిగిందంటూ గత ఏడాది అక్టోబర్ 2న మాయాబజార్, రుద్రంపూర్ ప్రాంతాల్లో యువకులు సెల్‌ఫోన్ టవర్లు ఎక్కారు. ఆ సమయంలో అప్పటి మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్కడి చేరుకున్నారు. అధైర్య పడొద్దని, తమ ప్రభుత్వం వచ్చాక అర్హులందరికీ పట్టాలు ఇప్పిస్తామని, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రస్తుతం అక్కడి నిర్వాసితులు నిరాశ్రయులైనా పొంగులేటి మాట నీటి మూటగానే మిగిలిపోయింది.

30 ఏళ్లుగా ఉంటున్నా మాకు పట్టా రాలేదు..

సర్వే సమయంలో మా ఆయనకు పక్షవాతం రావడం వల్ల మేం ఆస్పత్రిలో ఉన్నాం. ఆ తర్వాత మేం అధికారులను కలిసి పత్రాలన్నీ ఇచ్చాం. కానీ మాకు పట్టా రాలేదు. మాలాగా సొంతగా ఇంటిని నిర్మించుకొని ఉంటున్న ఇంకొంత మందిది కూడా ఇదే పరిస్థితి. అర్హులు కాని వారందరూ అర్హులయ్యారు. అర్హులైన మేము అనర్హులయ్యాం.

–మిట్టపల్లి కల్యాణి, ఎస్ఆర్‌టీ ఏరియా

గత్యంతరం లేకనే ఇంటిని నిర్మించుకున్నాం..

నేను సింగరేణిలో 36 ఏళ్లు పనిచేశా. అప్పటి మా కార్మికుల ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇంటి ముందు ఖాళీ జాగా ఉంటే తుమ్మలు మొలిచిన ప్రాంతంలో శుభ్రం చేసుకొని సొంతగా ఇంటిని కట్టుకున్నాం. ఇప్పుడు అధికారులు వచ్చి మరో చోట పట్టా ఇచ్చారు. ఇక్కడ వెంటనే ఖాళీ చేయాలంటున్నారు. ఇప్పుడున్న నా ఆర్థిక స్తోమతతో కొత్తగా ఇల్లు నిర్మించుకోలేను. ప్రభుత్వమే మాకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి.

–బొజ్జం రాయమల్లు, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి

ఇల్లు కూలగొడితే ఇల్లు కట్టియ్యరా?

ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తానంటున్న ప్రభుత్వం.. ఇల్లులు కూల్చి వేసిన మాకు ఇల్లు కట్టియ్యదా? మేము ఇక్కడ 24 ఏళ్లుగా ఉంటున్నాం. మా తండ్రి కూడా సింగరేణిలో పనిచేశాడు. సింగరేణి క్వార్టర్లలో అక్రమంగా ఉన్నవారికి అదే వంద గజాలు ఇచ్చారు. కష్టంతో మేం నిర్మించుకున్న ఇంటికి కూడా అదే వంద గజాలు ఇచ్చారు. కనీసం నష్ట పరిహారం కూడా ఇవ్వకుండా కూల్చడంతోనే 39 మందిమి కోర్టును ఆశ్రయించాం.

–మాదిరి శంకర్, ఎస్ఆర్‌టీ ఏరియా

ఉపాధి కోల్పోయాం..

వంద గజాల ఇంటి స్థలం ఇచ్చామని చెప్పి సింగరేణి అధికారులు మా ఇల్లు కూల్చివేశారు. వంద గజాల్లో ఇల్లు ఎక్కడ కట్టుకోవాలి? కార్కానా ఎక్కడ పెట్టుకోవాలి? ఉన్నపళంగా ఖాళీ చేయాలంటున్నారు. ఈ గొడవల వల్ల కొన్ని రోజులుగా పనిలేక పస్తులు ఉండాల్సి వస్తోంది. ఇప్పటికిప్పుడు ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. ప్రభుత్వమే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి.

–మందా నాగేశ్వరరావు, కార్పెంటర్, ఎస్ఆర్‌టీ ఏరియా

వసతులు కల్పించాం..

వెంకటేశ్ ఖని ఓసీ విస్తరణలో భాగంగా ఎస్ఆర్‌టీ ఏరియా, మాయాబజార్, వనమా నగర్‌లలో ఉంటున్న నిర్వాసితుల కోసం ఎకరానికి 2.32 కోట్లు వెచ్చించి 15 ఎకరాలను సేకరించాం. సర్వే నెంబర్ 143లో ఒక్కొక్కరికి వంద గజాల చొప్పున 345 మందికి స్థలాలను ఇచ్చాం. అక్కడ రోడ్లు, డ్రెయిన్లు, బోర్లు, కరెంటు వంటి సౌకర్యాలను కల్పించాం. ఎస్ఆర్‌టీ ఏరియా నుంచి మ్యాగ్జైన్ ఏరియాకు సామాగ్రిని తరలించుకునేందుకు వాహనాలను అందుబాటులో ఉంచాం. ఇంకా ఏమైనా అవసరమైతే తెలియజేయాలి. **–శ్రీరమేశ్, పీవో, వెంకటేశ్ ఖని**

భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- గ్యారెంటీ హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం
- కేసీఆర్ అభివృద్ధి చేసిన తెలంగాణను కాంగ్రెస్ విచ్ఛిన్నం చేస్తోంది
- తెలంగాణ నుంచి కేసీఆర్ పేరును ఎవరూ వేరు చేయలేరు
- కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

దుమ్ముగూడెంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

భద్రాచలం/ దుమ్ముగూడెం/ చర్ల, నవంబర్ 2: భవిష్యత్‌లో అధికారం బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని విమర్శించారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ సర్కారుపై పోరాడేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి జిల్లా భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెంలలో ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం మండలంలోని ప్రతి వార్డులోనూ బీఆర్ఎస్ కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. 420 వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. హామీలను అమలుచేయకపోగా కేసీఆర్ అభివృద్ధి చేసిన తెలంగాణ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ నుంచి కేసీఆర్ పేరును ఎవరూ వేరు చేయలేరని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారని అన్నారు. నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, ఆయా మండలాల నాయకులు కోటగిరి ప్రబోద్‌కుమార్, ఆకోజు సునీల్‌కుమార్, కోలా రాజు, ఉడతా రమేశ్, రేపాక పూర్ణచందర్ రావు, అంబటికర్ర కృష్ణ, పడిసిరి శ్రీనివాసరావు, కొల్లం ప్రేమ్‌కుమార్, బాసిబోయిన మోహన్ రావు, కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, కాపుల సూరిబాబు, అనిల్, ఏడుకొండలు, ప్రసాద్, రమేష్, యువరాజు, నర్సింహులు, శివ, గణేష్, నాగరాజు, సలోమి, రాణి, ప్రియాంక, ప్రదీప్, సాగి శ్రీనివాసరాజు, రేసు లక్ష్మి, బొల్లి వెంకట్రావు, కణితి రాముడు, జానీ పాషా, తునికి కామేశ్, అపకా వీర్రాజు, కొత్తూరు సీతారామారావు, జోగి వెంకటరమణ, వాగే వెంకటేశ్వరరావు, దామెర్ల శ్రీనివాస్, కొత్తా మల్లేశ్, రామిరెడ్డి, జ్యోతి, సావిత్రి, సాగి వర్మ, మోతుకూరి శ్రీకాంత్, లంకా శివ, జుంజూరు జయసింహ, భూక్యా చందు, కాటిబోయిన వెంకటేశ్వరరావు, గంగరాజు, వెంకటేశ్వరరావు, సోమయ్య, కామేశ్, వెంకటేశ్, సూర్యనారాయణ, రమేశ్, శ్రీను, ప్రసాద్, నాగేశ్వరరావు, రాము, సోయం కృష్ణబాబు, రాంబాబు, కిరణ్, కుర్సం రామారావు, సోయం రాజారావు, లంక రాజు, దొడ్డి తాతారావు, పోలిన రామచంద్ర రావు పాల్గొన్నారు. అనంతరం, చర్లలో ఆదివారం అనారోగ్యంతో మరణించిన బాలిక ప్రవళిక భౌతికకాయానికి నివాళులర్పించారు.

అటకెక్కిన కాంగ్రెస్ హామీలు

- 100 రోజులు కాదు.. 300 రోజులైనా హామీల అమలు లేదు..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది గులాబీజెండానే: మెచ్చా

సమావేశంలో మాట్లాడుతున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, నవంబర్ 3: మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, ఎన్నికల సమయంలో ఆ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలు అటకెక్కాయని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆరోపించారు. దమ్మపేట బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజులు కాదు.. 300 రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేసేవారు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నా మంత్రులకు, ఎమ్మెల్యేలకు కనిపించడంలేదని దుయ్యబట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రమంతా గులాబీజెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌పై మంత్రులు బాంబులు వేయడం కాదని.. కాంగ్రెస్ వాళ్లే కాంగ్రెస్ వాళ్లపై బాంబులు వేసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 32,820 ఎకరాల్లో మాత్రమే పామాయిల్ ఉందని, కానీ కేసీఆర్ ప్రభుత్వంలో 1,94,180 ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లక్ష ఎకరాలకు లక్ష్యం పెట్టుకుంటే కేవలం 18 వేల ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటారని అన్నారు. 2021-22లోనే అప్పారావుపేట ఫ్యాక్టరీకి 19.32 ఓఈఆర్ వచ్చిందని, ప్రస్తుతం మాత్రం 19.40 శాతమే వచ్చిందని అన్నారు. దీనికి కారకులైన కేసీఆర్‌కు పామాయిల్ రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 11 నెలలైనా నేటికీ రైతు బంధు రాలేదని, 30 శాతం రైతులకు రుణమాఫీ జరగలేదని విమర్శించారు. నియోజకవర్గంలో రిఫైనరీ ఫ్యాక్టరీ పెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు జోగేశ్వరరావు, దొడ్డా రమేశ్, సోయం వీరభద్రం, దారా యుగంధర్, రావుల శ్రీను, ఏసుబాబు, రూప్‌సింగ్, చిన్నవెంకటేశ్వరరావు, నారం రాజు, ధర్మ, పాకనాటి శ్రీను, పండు, లాలు, గణేశ్, రాజు, మనోజ్, తాళ్ల వెంకటేశ్వరరావు, పాశం ప్రసాద్, నాగయ్య, నాగరాజు, నాగేంద్ర, రవితేజ, భరత్, రమేశ్, పుల్లారావు, నాగేశ్వరరావు, శ్రీను, అబ్దుల్ జిన్నా, ఉమామహేశ్వరరావు, నడిపల్లి పోలయ్య, కొండముచ్చి నాగు పాల్గొన్నారు.

కోతలు పుల్లు.. కొనుగోళ్లు నిల్లు

- దుమ్మపేట ధాన్యమంతా ప్రైవేటు వ్యాపారులకే..
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తిప్పలు
- క్వింటాకు రూ.900 చొప్పున నష్టపోతున్న రైతులు

దమ్మపేట మండలంలో కోతలు పూర్తయిన వరి పొలాలు

దమ్మపేట రూరల్, నవంబర్ 3: వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కోతలు షురువైనప్పుడే కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా.. వాటి గురించి పట్టించుకునేవారు లేకపోవడంతో ధాన్యం ఎక్కడ నిల్వ చేసుకోవాలో.. ఎవరికి అమ్ముకోవాలో.. తెలియక రైతులు తంటాలు పడుతున్నారు. మండలంలో వానకాలం పంటగా సుమారు 10,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా.. 90 శాతం వరకు సన్న రకం ధాన్యాన్నే పండించారు. సన్న రకం ధాన్యంలో ఏ-గ్రేడు రకం క్వింటాకు రూ.2,320, దొడ్డు రకం బీ-గ్రేడు క్వింటాకు రూ.2,300 చొప్పున ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించింది. వారం రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా.. మరో రెండు మూడు రోజుల్లో 70 శాతం పైగా కోతలు పూర్తకానున్నాయి. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తాము పండించిన వరి ధాన్యాన్ని ఇంట్లో నిల్వ చేసుకోలేక.. పెట్టుబడి, కూలీల డబ్బులు చెల్లించాలనే ఉద్దేశంతో ప్రైవేటు వ్యాపారులకు రూ.400 తక్కువకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ధర క్వింటాకు రూ.500 కూడా దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడం వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.400 తక్కువ, బోనస్ రూ.500 మొత్తం కలుపుకొని క్వింటాకు రూ.900 చొప్పున రైతులు నష్టపోతున్నారు. గత నెల 29న జిల్లా వ్యవసాయాధికారులు, మిల్లర్లతోపాటు సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆరోజు నుంచే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అయితే రైస్ మిల్లుల ట్యాగింగ్, సంచుల సరఫరా తదితర ఏర్పాట్లు పూర్తి కావడానికి మరో మూడు నాలుగు రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. సంబంధిత శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఇక్కడ కొని.. అక్కడ అమ్మేందుకు..

రైతుల నుంచి తక్కువ ధరకు కొన్న ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లాభాలు గడిచేందుకు కొందరు వ్యాపారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. తమ బినామీ పేర్లపై రైతుల వద్ద కొనుగోలు చేసి నిల్వ చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి క్వింటాకు రూ.900 వరకు వ్యాపారులు లాభాలను ఆర్జించనున్నారు.

ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లే..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ఇవ్వలేదు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో క్రమం తప్పకుండా రైతుబంధు వచ్చేది. ఇప్పుడు ధాన్యం చేతికొచ్చినా కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడం లేదు. బోనస్ ఇస్తారనే నమ్మకం లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నాం. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

–శంకరయ్య, రైతు, తొట్టిపంపు

జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల ప్రారంభంలో కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 3: భద్రాద్రి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరగనున్న అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం కొత్తగూడెంలో ప్రారంభమయ్యాయి. స్థానిక ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ పాల్గొనడం వల్ల జీవితంలో చక్కగా స్థిరపడవచ్చన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. కాగా, 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీల్లో టీం చాంపియన్‌షిప్, వ్యక్తిగత అంశాల్లో ఈ పోటీలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపనున్నారు. ఈ పోటీల్లో టీం చాంపియన్‌షిప్ విభాగంలో ఆతిథ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. బాలుర జట్టు సైతం అద్భుతమైన ప్రతిభకనబర్చి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం సాయంత్రం నుంచి వ్యక్తిగత పోటీలను నిర్వహించనున్నారు. డీఈవో వెంకటేశ్వరచారి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరేశ్‌కుమార్, పోటీల రాష్ట్ర పరిశీలకుడు మామిడి సంతోశ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బట్టు ప్రేంకుమార్, యనమదల వేణుగోపాల్, లక్ష్మయ్య, శేఖర్, స్టెల్లా, రాము, కవిత, సీతాదేవి, సుజాత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర మంత్రులు తుమ్మల, పొంగులేటి
- టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఖమ్మంలో వన సమారాధన

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, నవంబర్ 3: ఉద్యోగులు సహకరిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడితోటలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో సకల ఉద్యోగుల కార్తీకమాస వన సమారాధన, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. దీనికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, చైర్మన్ మారం జగదీశ్వర్ కలిసి మంత్రులతను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రజలు తమకు జరిగే మంచిలో అధికారుల, ఉద్యోగుల పేర్లు శాశ్వతంగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను దశల వారీగా చెల్లిస్తూ వారికి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేస్తూ ఉద్యోగులపై భారం తగ్గిస్తున్నామన్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అన్నం శ్రీనివాసరావు, వనజీవి రామయ్య, సీనియర్ సిటిజన్ రిటైర్డ్ ఉద్యోగులను ఉద్యోగ సంఘాల తరపున సత్కరించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, శాసనమండలి సభ్యుడు ఏ.నర్సిరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ప్రజాప్రతినిధులు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ, జేఏసీ నాయకులు కస్తాల సత్యనారాయణ, వేదాద్రి, రుక్మారావు, ఉద్యోగుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు